క్లుప్తంగా

కర్ణాటక బస్సు బోల్తా



బోల్తాపడిన బస్సులో నుంచి డ్రైవర్‌ను బయటకు తీస్తున్న స్థానికులు

కార్వేటినగరం: కర్ణాటక బస్సు బోల్తాపడిన సంఘటన చిత్తూరు –పుత్తూరు జాతీయ రహదారిపై మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా.. సోమవారం కర్ణాటకకు చెందిన కేఎస్ ఆర్టీసీ బెంగళూరు నుంచి పుత్తూరుకు వెళ్తుండగా పద్మసరస్సు సమీపంలోని కుప్పానిగుంట చిన్నకనుమపై భారీ వర్షం రావడంతో ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించబోయి అదుపు తప్పి రోడ్డుపక్కన బోల్తా పడింది. అయితే బస్సులో తక్కువమంది ప్రయాణికులు ఉన్నారు. ఎవరికీ ఎలాంటి గాయాలు లేకుండా బయట పడడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. బస్సులో ప్రయాణికులతో పాటు డ్రైవర్‌ను స్థానికులు సురక్షితంగా బయటకు తీశారు.

మృత్యుంజయస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో మృత్యుంజయస్వామి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయం లోని మృత్యుంజయస్వామికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గణపతిపూజ, కలశ స్థాపన పూజలు చేశారు. అనంతరం స్వామివారికి చందనం, నారికేళ్ల, పసుపు, కుంకుమ, విబూధి వంటి వాటితో అభిషేకాలు చేశారు. అనంతరం సుందరంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, వేదపండితులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణను సద్వినియోగం చేసుకోండి



సైన్స్ పాఠ్యాంశాలపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయుడు మునిరాజ

కార్వేటినగరం: గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని టీకేఎం పేట ఉన్నత పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు మునిరాజ అన్నారు. సోమవారం ఆయన గ్రంథాలయంలో జరుగుతున్న వేసవిశిక్షణా తరగతులకు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని అభివర్ణించారు. గ్రంథాలయాల్లో అందుబాటులో ఉన్న పురాతన గ్రంథాలు, పోటీ పరీక్షల పుస్తకాలను పఠనం చేయడం వల్ల ప్రతిభ చూపవచ్చని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి శంకర్‌బాబు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



సేనాపతి ఉత్సవంలో విష్వక్సేనుడు

నారాయణవనం: శ్రీపద్మావతీ సమేత శ్రీకల్యాణ వెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు సోమవారం సాయంత్రం సేనాపతి ఉత్సవంతో అంకురార్పణ చేశారు. సేనాపతి ఉత్సవంలో విష్వక్సేనుడు తిరుచ్చి వాహనాన్ని అధిరోహించి మాడవీధులలో విహరించారు. ఉదయం సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరచిన అర్చకులు నిత్యపూజా కార్యక్రమాలను నిర్వహించారు. స్థానిక భావనారుషి ఆలయం నుంచి పద్మశాలీలు కొడి పార్వవస్త్రాన్ని మేళ తాళాలతో ఆలయ అర్చకులకు సమర్పించారు. సేనాపతి ఉత్సవంలో భాగంగా మృత్సంగ్రహణం, పుట్టమట్టిని పాలికలో నింపి నవధాన్యాలను మొలకెత్తించే కార్యక్రమాలను అర్చకులు చేపట్టారు. ఉత్సవర్ల ఊరేగింపు జరిగే వీధుల స్థితిగతుల పర్యవేక్షణకు విష్వక్సేనుడు తిరుచ్చి వాహనంపై మాడవీధుల్లో విహరించారు.

నేడు ధ్వజారోహణం

ఆలయ అర్చకులు శ్రీధరభట్టాచార్య, శ్రీనివాస రాఘవభట్టాచార్య, నరసింహభట్టాచార్యులు మాట్లాడుతూ మంగళవారం వేకువ జామున 4 గంటలకు సుప్రభాత సేవతో నిత్య కైంకర్యాలను పూర్తి చేసి, 7.30 గంటలకు మాడవీధుల్లో దిక్పాలకులను బలపీఠాలలో ఆవాహనం చేసి, 9.45 గంటల్లోపు మిథున లగ్నంలో గరుడాళ్వార్ చిత్రపటం ఉన్న వస్త్రాన్ని ధ్వజస్తంభానికి అధిరోహింపచేయడంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. ఉదయం 10 గంటలకు ఉభయ నాంచారులతో కల్యాణ వెంకన్న ఉత్సవర్లకు తిరుమంజనం, సాయంత్రం 5.30 నుంచి అరగంట పాటు స్వామివారి ఊంజల్‌సేవ నిర్వహిస్తామని తెలిపారు. రాత్రి 7 గంటలకే స్వామి వారు పెద్దశేష వాహనంపై ఊరేగింపుగా వెళ్తారని తెలిపారు.

చెరుకు సాగు.. లాభాలు బాగు

చెరుకు సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే చాలని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. పంట సాగు చేసినప్పటి నుంచి భూమిలో తేమశాతం తగ్గకుండా చూసుకోవడంతో ఎర్రనల్లి, పీక పురుగు పంటను ఆశించకుండా చూసుకుంటే లాభాలు గడించవచ్చు అంటున్నారు.



ఏపుగా పెరిగిన చెరుకు పంట



డ్రిప్ పద్ధతిలో సాగు చేసిన చెరుకు పంట

- తొలి దశలో జాగ్రత్తలు పాటిస్తే పంటకు మేలు
- బెట్టకు గురికాకుండా చూడాలి
- యాజమాన్య పద్ధతులతో పీక పురుగు, ఎర్రనల్లి నివారణ
- పంటలో సస్యరక్షణకు జాగ్రత్తలు పాటించాలంటున్న వ్యవసాయ అధికారులు

కార్వేటినగరం: సాధారణంగా చెరుకు పంట జనవరి నుంచి మార్చి నెల మధ్య కాలంలో సాగు చేస్తారు. బాల్య దశలోనే తోటలు నీటి ఎద్దడికి గురైనప్పుడు తగిన విధంగా పోషకాలను గ్రహించలేవు. ఈ సమస్య తలెత్తకుండా పోషకాలను ఆకుల ద్వారా అందించాలి. లీటరు నీటికి 10 గ్రాముల యూరియా, 10 గ్రాముల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులను కలిపి ఎకరాకు 200 లీటర్ల ద్రావణాన్ని పైరుపై పిచికారీ చేయాలి. కొద్దిగా జిగురును కలుపుకున్నట్లయితే ద్రావణం ఆకులకు అంటుకుని సమర్థవంతంగా వినియోగమవుతుంది. ఈ ద్రావణాన్ని 15 రోజుల వ్యవధి ఇస్తూ మూడుసార్లు పిచికారీ చేయవచ్చు. నీటి వనరులు పుష్కలంగా ఉన్న ప్రాంతాల్లో వేసవిలో వారం రోజులకు ఒకసారి, పరిమిత నీటి వసతి ఉన్న రైతులు 10–15 రోజుల వ్యవధిలో నీటి తడులు ఇవ్వాలి.

తేమశాతం కాపాడుకోవాలంటే..

నేలలో తేమ శాతాన్ని కాపాడేందుకు పంట బాల్య దశలో ఉన్నపుడు వరుసల మధ్య ఎకరాకు 1.25 టన్నుల చెరుకు చెత్తను పరచాలి. ఇది నీరు ఆవిరయ్యే శాతాన్ని తగ్గించి మల్చ్‌గా ఉపయోగపడడమే కాకుండా కుళ్లిన తరువాత సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతుంది. డ్రిప్ ద్వారా నేరుగా వేరు వ్యవస్థకు నీరు అందించడం వల్ల నీరు సద్వినియోగం అవుతుంది. పోషకాలను డ్రిప్ ద్వారా అందిస్తే అవి కూడా సమర్థవంతంగా ఉపయోగపడుతుంది. ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ సంస్థ ద్వారా పెద్ద మొత్తం రాయితీ డ్రిప్ పరికరాలను అర్హత గల రైతులకు అందిస్తోంది. నీటిని పొదుపుగా వాడుకుంటే ఎక్కువ విస్తీర్ణంలో పంట సాగు చేయవచ్చు.

ట్రైకో కార్డులతో ఉపయోగం..

జీవ నియంత్రణ పద్ధతిలో భాగంగా లభ్యత ఆధారంగా ట్రైకో కార్డులను ఉపయోగించాలి. ఒక్కో కార్డు మీద 20 వేల గుడ్లు ఉంటాయి. ఈ గుడ్లు పరాన్నజీవి కాండను ఎనిమిది ముక్కలుగా చింపి వాటిని చెరుకులో విడుదల చేయాలి. చల్లగా ఉండే సమయం సాయంత్రం వేళ లేదా ఉదయం వాటిని విడుదల చేయాలి. అలాగే అక్కడక్కడా ఆకుల అడుగు భాగంలో ముక్కలను పిన్ సహాయంతో గుచ్చిపెట్టాలి. వాటిని నాలుగు వారాలకు మొదలు పెట్టి ప్రతి 7 నుంచి 10 రోజులకు ఒకసారి మొత్తం నాలుగు పర్యాయాలు విడుదల చేస్తే ఈ పీక పురుగును సమర్థవంతంగా నివారించవచ్చు. రసాయన మందుల వాడకంలో భాగంగా నాటిన నాలుగు నుంచి ఆరు, తొమ్మిది వారాలప్పుడు లీటరు నీటిలో 2.5 మిల్లీలీటర్ల చొప్పున క్లోరోపైరిఫాస్ట్ మందును కలిపి పైరుపై పిచికారీ చేయాలి.

పురుగు నియంత్రణకు..

ముచ్చెలను లోతైన కాలువల్లో నాటడం ద్వారా ఈ పీక పురుగు ఉధృతిని భాగా తగ్గించవచ్చు. మూడు కళ్ల ముచ్చెలను సుమారు 25 సెంటీ మీటర్ల లోతు కాలువల్లో నాటుకుంటే తేమ ఎక్కువగా ఉండడం వల్ల ఈ పురుగు బెడద తగ్గుతుంది. నాటిన మూడో రోజున చెరుకు చెత్త (ఎండు చెరుకు ఆకు)ను కప్పడం మరో యాజమాన్య పద్ధతి. దీన్ని కప్పడం వల్ల మూడు ప్రయోజనాలు కలుగుతాయి. ఎకరాకు 1.25 టన్నుల చెరుకు చెత్త కప్పాలి.

చీడ పురుగుల నివారణ

చెరుకు పంటకు బాల్య దశలో పీకపురుగు బాగా నష్టం కలిగిస్తుంది. దీని నివారణకు సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. పీక పురుగు సాధారణంగా భూమి పైభాగంలో ఉన్న కాండాన్ని తొలచి లోపలి కణజాలాన్ని తినేయడం వల్ల పోషక పదార్థాల సరఫరా ఆగి పోయి చనిపోయిన మొవ్వులు ఏర్పడుతాయి. ఈ లక్షణాలు ముచ్చెలు(చెరుకు విత్తన పిచ్చెలు) నాటిన వారం నుంచి 120 రోజుల వరకు కనిపిస్తాయి.

ఎర్రనల్లి నివారణ..



చెరుకు పంట బాల్యదశలో ఎర్రనల్లి ఆశించే అవకాశం ఉంది. ఇది ఆకుల అడుగు భాగాన చేరి రసం పీల్చడం వల్ల ఆకులు ఎండిపోతాయి. వీటి నివారణకు లీటరు నీటికి 5 మిల్లీలీటర్ల చొప్పున డైకోఫాల్ మందును కలిపి పిచికారీ చేయాలి. ఈ విధంగా చెరుకు బాల్య దశలో తగిన జాగ్రత్తలు పాటించడం ద్వారా మంచి దిగుబడి సాధించవచ్చు.

–హేమలత, ఏఓ, కార్వేటినగరం మండలం

రికార్డుల నిర్వహణపై అవగాహన



డ్వాక్రా మహిళలకు వివరిస్తున్న ఐకేపీ ఏపీఎం ఫరీద్ మస్తాన్

పాలసముద్రం: మండలంలోని వీఓఏలు తమ రికార్డులను సక్రమంగా నమోదు చేయాలని ఐకేపీ ఏపీఎం ఫరీద్ మస్తాన్ తెలిపారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో సీఆర్పీ, సీసీఎస్, స్త్రీనిధి రికవరీ, ఆరోగ్యపోషణ గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ స్త్రీనిధి ద్వారా ఇప్పుడు 10 సభ్యులకు రూ.5 లక్షలు ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించుకోవాలన్నారు. స్త్రీనిధి, ఉన్నతి అప్పులపై సామాజిక తనిఖీ కూడా జరుగుతుందన్నారు. డ్వాక్రా గ్రూపులకు, సిబ్బందికి రికార్డుల నిర్వహణ, స్త్రీనిధి రికవరీ తదితర వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీసీ చిరంజీవి, లోకనాథం, సంఘమిత్ర మురగయ్య, మంజుల, బాలయ్య, వీఓ లీడర్లు పాల్గొన్నారు.

వెదురుకుప్పంలో మోస్తరు వర్షం

వెదురుకుప్పం: మండలంలోని సోమవారం మోస్తరు వర్షం కురిసింది. పచ్చికాపల్లం, వెదురుకుప్పం, నల్లవెంగనపల్లె, మాంబేడు ప్రాంతాల్లో వర్షం పడింది. ఉపరితల ఆవర్తనం కారణంగా ఉరుములు మెరుపుతో కూడిన వర్షం పడడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు ఈ వర్షంతో కాస్త సేదతీరారు.

ఘనంగా ప్రదోష పూజలు



ప్రత్యేక అలంకరణలో నందీశ్వరుడు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎస్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం ప్రదోషకాల పూజలు ఘనంగా జరిగింది. ఈసందర్భంగా శివునికి నందీశ్వరునికి ఏకకాలంలో అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. అంతకుముందు వేకువజామునే కొండమల్లీశునికి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో స్వామివారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి భక్తిప్రపత్తులతో పూజలు చేశారు. సోమవారం సాయంత్రం నందీశ్వరుడిని ప్రత్యేకంగా అలంకరించి పాలు, పెరుగు, కుంకుమతో అభిషేకించారు. ప్రదోష పూజలనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు పంచి పెట్టారు. ఇందులో భాగంగా ఆలయం ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామికి పూజలు చేశారు. ఆలయ ఆవరణలో చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

నందీశ్వరుడికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో నందీశ్వరుడు

వెదురుకుప్పం: మండలంలోని చవటగుంటలో ఉన్న ఆవుదేవర మీనాక్షి సమేత నందీశ్వర స్వామి ఆలయంలో సోమవారం స్వామి వారికి ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామునే సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం నందీశ్వరుడికి పాలాభిషేకం చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో స్వామివారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి భక్తి ప్రపత్తులతో పూజలు చేశారు. అదేవిధంగా డీఆర్ఎస్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరిపై కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేక పూజలు చేశారు.

విద్యుత్ చౌర్యంపై విస్తృత దాడులు



కార్వేటినగరం పెద్దదళితవాడ వద్ద అక్రమ విద్యుత్ వాడకాన్ని తొలగిస్తున్న విజిలెన్స్ అధికారులు

కార్వేటినగరం: విద్యుత్ చౌర్యంపై విస్తృత దాడులు నిర్వహించి కేసులు నమోదు చేసినట్లు విజిలెన్స్ విభాగం ఈఈ బాలాజీ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా విద్యుత్ ఏడీగా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈఈ బాలాజీ మాట్లాడారు. కార్వేటినగరం పరిధిలో ఎక్కువగా అక్రమంగా విద్యుత్ వాడుతూ విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నట్లు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించడం జరిగిందన్నారు. కార్వేటినగరం పెద్దదళితవాడ వద్ద ఏర్పాటు చేసిన వాలీబాల్ క్రీడా మైదానానికి ఏర్పాటు చేసిన అక్రమ విద్యుత్ కనెక్షన్‌ను తొలగించి, అందుకు వినియోగించిన విద్యుత్ వైర్లను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. అలాగే నగరంలో దుకాణాలపై విస్తృతంగా దాడులు నిర్వహించి సుమారు 35 అడిషనల్ లోడు కేసులు నమోదు చేయడమే కాకుండా 3 మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు చేసి రూ.లక్ష వరకు జరిమానా విధించడం జరిగిందన్నారు. కార్వేటినగరం డివిజన్ పరిధిలో ఎక్కడైనా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నట్లు తెలిసిన వెంటనే 9440811820 ఏడీఈ నాగరాజు, 9440811821 ఏఈ రియాజ్ అహ్మద్ నంబర్లకు సమాచారం అందించి విద్యుత్ చౌర్యాన్ని అరికట్టేందుకు ప్రజలు సహకరించాలని పిలుపునిచ్చారు. వారి వెంట విజిలెన్స్ విభాగం ఏఈలు హరి, కృష్ణయ్య, రాజ, సిబ్బంది ఉన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన



క్యాండిల్స్ వెలిగించి ప్రదర్శన చేస్తున్న స్టెప్స్ సిబ్బంది

నగరి: ప్రపంచ హెచ్ఐవీ క్యాండిల్ లైట్ మెమోరియల్ డే సందర్భంగా స్టెప్స్ నగరి ప్రివెన్షన్ యూనిట్‌లో క్యాండిల్స్ వెలిగించి ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. హెచ్ఐవీ ద్వారా మరణించిన వారికి శ్రద్ధాంజలి ఘటిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఏడాది మే నెలలో అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ స్మారక దినోత్సవం జరుపుకుంటామని సంస్థ నిర్వాహకులు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన పెంచుకోవాలని అదే వ్యాధిని నిర్మూలించే ప్రధాన మార్గమన్నారు. కార్యక్రమంలో సంస్థ సిబ్బంది, ఎడ్యుకేటర్లు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు



గంగాధరనెల్లూరు వద్ద ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న జేసీ శ్రీనివాసులు

కార్వేటినగరం: అక్రమంగా ఇసుక తరలింపునకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. సోమవారం చిత్తూరు జిల్లాలోని ఇసుక రీచ్‌లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 14 ఇసుక రీచ్‌లకు అనుమతులు ఇచ్చామన్నారు. ప్రస్తుతం వాటి కాలపరిమితి పూర్తి అవ్వడం జరిగిందన్నారు. రీచ్‌ల నుంచి ఇసుక తరలింపు చేపడితే చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే ఇసుక రీచ్‌లపై కేసు నమోదయినట్లు జేసీ తెలిపారు. కోర్టు ఆదేశాల మేరకు ఇసుక రీచ్‌లను పరిశీలించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు.

ఘనంగా చిన్న కొట్టాయి ఉత్సవం



స్వామి, అమ్మవార్లకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో చిన్నకొట్టాయి ఉత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఆలయ అలంకార మండపంలో స్వామి, అమ్మవార్లకు పలు రకాల అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలోని పగడ చెట్టు వద్దకు తీసుకువచ్చి స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి ఊరేగించారు. కార్యక్రమంలో ఈఓ ఎస్వీ నాగేశ్వరరావు, పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, సభ్యులు, ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

వైభవోపేతం... గోవిందుని గరుడ సేవ



గరుడ సేవలో టీటీడీ ఈఓ ధర్మారెడ్డి, జేఈఓలు



గరుడ వాహనంపై శ్రీగోవిందరాజ స్వామి

తిరుపతి కల్చరల్: గోవింద నామస్మరణ నడుమ గరుడ వాహనదారుడైన శ్రీగోవిందరాజస్వామిని కీర్తిస్తూ భక్తులు గరుడ వాహన సేవను తిలకించి పులకించారు. శ్రీగోవిందరాజ స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్వామివారి గరుడ వాహన సేవ అత్యంత వైభవోపేతంగా సాగింది. స్వామివారి గరుడ సేవను పురస్కరించుకొని స్వామివారికి తిరుమల శ్రీవారి కానుకగా రూ.10 లక్షలు విలువైన ఆభరణాలను టీటీడీ ఈఓ ఏవీ. ధర్మారెడ్డి సమర్పించారు. ఈ సందర్భంగా టీటీడీ ఈఓ మాట్లాడుతూ తన అన్నగారైన శ్రీగోవిందరాజునికి తిరుమల శ్రీవారు రూ.10 లక్షలు విలువ చేసే మూడు ఆభరణాలైన వజ్రపోగులు, లక్ష్మీ కాసుల మాల, తెల్లరాళ్ల పతకాన్ని బహూకరించారని తెలిపారు. అనంతరం సర్వాంగ సుందర రూపుడైన శ్రీగోవిందరాజస్వామి సకల వైభవంతో శక్తివంతమైన గరుడ వాహనంపై అధిరోహించి ఆలయ నాలుగు మాడ వీధులలో విహరిస్తూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించి అనుగ్రహించారు. ఉదయం స్వామివారి పల్లకీ సేవ వేడుకగా సాగింది. స్వామి వారు మోహినీ అవతారంలో పల్లకీలో కొలువై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. తిరుమల పీఠాధిపతులు, టీటీడీ జేఈఓలు గౌతమి, వీరబ్రహ్మం, ఆగమ సలహాదారులు, ముఖ్య ఆర్థిక శాఖాధికారి బాలాజి, ఎస్ఈ–2 జగదీశ్వర్‌రెడ్డి, డెప్యూటీ ఈఓ శాంతి, భద్రతాధికారి బాలిరెడ్డి పాల్గొన్నారు.

వేరుశనగ విత్తన పంపిణీపై సమీక్ష



వేరుశనగ స్టాక్‌ను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ సంచాలకులు సౌభాగ్యలక్ష్మి

- వ్యవసాశాఖ సహాయ సంచాలకులు సౌభాగ్యలక్ష్మి

గంగాధర నెల్లూరు: ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులకు ఈనెల 23వ తేదీ నుంచి సబ్సిడీ వేరుశనగ విత్తన పంపిణీ కార్యక్రమం ప్రారంభం అవుతుందని వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు సౌభాగ్యలక్ష్మి తెలిపారు. గంగాధరనెల్లూరు ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఆమె గంగాధరనెల్లూరు మండలం, శ్రీరంగరాజపురం మండలం, పాలసముద్రం మండలాల వ్యవసాయ శాఖ సిబ్బందితో వేరుశనగ విత్తన పంపిణీపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 23వ తేదీ నుంచి ప్రభుత్వం నిర్దేశించిన ధర 40 శాతం సబ్సిడీ పోనూ ఒక వేరుశనగ బస్తా రూ.1710 చొప్పున రైతులకు అందజేస్తామన్నారు. వేరుశనగ విత్తనకాయలు కావలసిన రైతులు ముందుగా తమ పాసుబుక్, ఆధార్ కార్డు మొబైల్ ఫోన్‌తో రైతు భరోసా కేంద్రం వద్ద రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఈ విషయంలో ఎవరైనా అలసత్వం ప్రదర్శిస్తే సిబ్బందిపై తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. వేరుశనగ విత్తనాలలో కే6 రకం రూ.1710, నారాయణి రకం రూ.1746తో రైతులకు అందజేయబడుతుందని తెలిపారు. అలాగే సాగు చేసిన పంటల వివరాలను రైతులు ఈక్రాప్‌లో తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ వందన, పాలసముద్రం శ్రీరంగరాజపురం మండలాల వ్యవసాయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

23 నుంచి సబ్సిడీ వేరుశనగ పంపిణీ

వెదురుకుప్పం: ఖరీఫ్ సీజన్–2024 సంవత్సరానికి సంబంధించి రైతులకు ప్రభుత్వం రాయితీ ద్వారా అందజేసే వేరుశనగ విత్తనకాయలు 23 నుంచి పంపిణీ చేస్తున్నట్లు వ్యవసాయాధికారి వనిత సోమవారం తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో వేరుశనగ సాగు చేసే రైతులు ముందుగా ఆయా ప్రాంతాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో ఆధార్ కార్డు, పట్టాదారు పాసు పుస్తకం, మొబైల్ నంబర్ తెచ్చి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ తరువాత సిబ్బంది టోకెన్లు ఇస్తారన్నారు. టోకెన్లు, మొబైల్ నంబర్ తీసుకెళ్తే రైతులకు 40 శాతం రాయితీ విత్తనాలు పంపిణీ చేస్తారన్నారు. కే6 రకం విత్తన కాయలు 30 కేజీల బస్తా రూ.1710, నారాయణి రకం 30 కేజీల బస్తా రూ.1,746 చొప్పున అందజేస్తున్నట్లు తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శ్రీరంగరాజపురంలో..

శ్రీరంగరాజపురం: ప్రభుత్వం అందించే వేరుశనగ రాయితీ విత్తనాలకు రైతులు సంబంధిత రైతుభరోసా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏఓ నర్మద అన్నారు. ఆమె మాట్లాడుతూ వచ్చే ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ప్రభుత్వం మండలానికి 816 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలను అందించడం జరిగిందన్నారు. ప్రభుత్వం 40 శాతం రాయితీతో 30 కేజీల వేరుశనగ బస్తా ధర రూ.1710గా నిర్ణయించడం జరిగిందన్నారు. ప్రతి రైతు సంబంధిత ఆర్బీకేలో రూ.1710 చెల్లించి ఈ నెల 23వ తేదీ నుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. రైతులు తమ భూమి పాసుపుస్తాకం, 1బి, ఆధార్‌కార్డు జిరాక్స్ కచ్చితంగా తీసుకురావాలన్నారు.



మండలానికి చేరిన వేరుశనగ విత్తనాలు

ఉచిత వైద్యశిబిరాలు



కంటి ఆపరేషన్లకు ఎంపికైన వృద్ధులు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పుత్తూరు: ప్రజారోగ్యమే లక్ష్యంగా రాస్ సంస్థ పలు ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తోందని శంకర్ నేత్రాలయ అధికారి వెంకటముని తెలిపారు. సోమవారం రాష్ట్రీయ సేవాసమితి (రాస్), చెన్నైకి చెందిన శంకర్ నేత్రాలయ హాస్పిటల్ వారు సంయుక్తంగా నారాయణవనం, పాలమంగళం గ్రామాల్లో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సదర్భంగా శంకర్ నేత్రాలయ అధికారి వెంకటముని మాట్లాడుతూ మహిళా పొదుపు సంఘ సభ్యుల సౌకర్యార్థం రాస్ సంస్థ పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం హర్షణీయమన్నారు. ఉచితంగా వృత్తి శిక్షణా తరగతులు నిర్వహిస్తూ, మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ఎంతగానో దోహదపడుతున్నారని చెప్పారు. రెండు గ్రామాల్లో నిర్వహించిన కంటి వైద్యశిబిరాల్లో 150 మందికి పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. 23 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వీరికి చెన్నైలోని శంకర్ నేత్రాలయ హాస్పిటల్లో ఉచితంగా ఆపరేషన్లు చేయడానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాస్ అధికారి రవి, సిబ్బంది ప్రకాష్, మునిరత్నమ్మ, మునివేలు, లక్ష్మీ, ఉమ, గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు.